


# మన దునియా

మన అక్షరం - మన ప్రపంచం

RNI Number TELTEL/2023/85680








సంపుటి : 4 | సంచిక : 19 | సెప్టెంబర్ 24 గురువారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-


# జర్నలిస్ట్ బస్వరాజుపై కేసులు.. ఎత్తివేయాలి!






- మీడియా గొంతు నొక్కే చర్యలు వద్దు
- కేసులపై సమగ్ర విచారణ జరపాలి
- నిజానిజాలు పరిశీలించి నిర్ణయం తీసుకోవాలి
- ప్రభుత్వం, పోలీస్ శాఖ స్పందించాలి

## మాజీ జడ్పీ చైర్మన్ దాదాన్నగారి విఠల్‌రావు డిమాండ్

**మన దునియా,నిజామాబాద్ జిల్లా:సెప్టెంబర్ 23**

నిజామాబాద్ జిల్లాకు చెందిన జర్నలిస్ట్ బస్వరాజుపై నమోదైన కేసుల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. ఈ కేసులను తక్షణమే సమీక్షించి, అక్రమంగా నమోదైనవిగా తేలితే ఎత్తివేయాలని మాజీ జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి దాదాన్నగారి విఠల్‌రావు ప్రభుత్వాన్ని, పోలీస్ శాఖను డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య మీడియా వారధిగా పనిచేస్తుందని, ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశాలను వెలుగులోకి తీసుకురావడం పాత్రికేయుల బాధ్యత అని అన్నారు.

(మిగతా 2వ పేజీలో..)

## తెలంగాణ ఉద్యోగులకు గుడ్‌న్యూస్.. రెండు డీఏలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

- సీఎస్‌తో ఉద్యోగ సంఘాల ప్రతినిధుల సమావేశం
- అక్టోబర్ జీతంతో మొదటి డీఏ చెల్లింపు
- ఉగాది సందర్భంగా రెండో డీఏ విడుదల
- చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న డీఏలు
- పీఆర్సీపై ఇంకా నిర్ణయం ప్రకటించని ప్రభుత్వం

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ సర్కారు తీపి కబురు చెప్పింది. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న కరవు భత్యం (డీఏ) విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో బుధవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన

(మిగతా 2వ పేజీలో..)



## ఇది ఎల్ నినో కాదు.. కాంగ్-నినో: రాష్ట్రంలో కరెంట్ కోతలపై కేటీఆర్

- రాష్ట్రంలో కరెంట్ కోతలకు 'కాంగ్-నినో' కారణమన్న కేటీఆర్
- కాంగ్రెస్ వచ్చింది.. కరెంట్ పోయిందంటూ ప్రభుత్వానికి చురక
- సింగరేణి నుంచి 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని ఆరోపణ
- జెన్‌కో వద్ద బొగ్గు నిల్వలు లేవని, థర్మల్ ప్లాంట్లు మూసేశారని విమర్శ
- రైతులకు 24 గంటల విద్యుత్ హామీని నెరవేర్చాలని డిమాండ్



రాష్ట్రంలో నిరంతరాయంగా

(మిగతా 2వ పేజీలో..)

## భారీ వర్షానికి దెబ్బతిన్న చార్మినార్.. ఊడిపడిన ప్లాస్టరింగ్

- హైదరాబాద్‌లో భారీ వర్షాల కారణంగా చార్మినార్‌కు స్వల్ప నష్టం
- లాడ్ బజార్ వైపు ఉన్న మినార్ ప్లాస్టరింగ్ పెచ్చులు ఊడిపడిన వైనం
- మరమ్మతుల కోసం ఇప్పటికే టెండర్ ప్రక్రియలో ఉందని ఏఎస్ఐ వెల్లడి
- శనివారం వరకు భారీ వర్ష సూచనతో అప్రమత్తమైన అధికారులు

భాగ్యనగరంలో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో చారిత్రక కట్టడం చార్మినార్ స్వల్పంగా దెబ్బతింది. మంగళవారం రాత్రి పాతబస్తీలో

(మిగతా 2వ పేజీలో..)



## గణేశ్ నిమజ్జనం: 25న సెలవు, వేలాదిమంది పోలీసులతో భారీ బందోబస్తు

- గణేశ్ నిమజ్జనం సందర్భంగా 25న జీహెచ్ఎంసీ పరిధిలో సెలవు
- ఏఐ టెక్నాలజీ, డ్రోన్లతో నిమజ్జన ప్రక్రియపై ప్రత్యేక నిఘా
- నిమజ్జనం రోజు నగరంలోకి ప్రైవేట్ బస్సులు, లారీలకు అనుమతి నో
- డీజేలు, అసభ్య నృత్యాలపై కఠిన చర్యలని సీపీ హెచ్చరిక



హైదరాబాద్‌లో వినాయక నిమజ్జనం

(మిగతా 2వ పేజీలో..)

## రేవంత్ రెడ్డికి నెల రోజుల డెడ్ లైన్ విధించిన కవిత

- ఆదిలాబాద్ రిమ్స్ ప్రమాదానికి ప్రభుత్వమే కారణమన్న కవిత
- ఐదుగురు పిల్లలు ప్రాణాలు కోల్పోతే రేవంత్ కు పరామర్శించే సమయం కూడా లేకపోయిందని మండిపాటు
- నెల రోజుల్లోగా ప్రభుత్వ ఆసుపత్రులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని హెచ్చరిక

ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలోని స్పెషల్ న్యూబోర్న్ కేర్ యూనిట్ లో చోటుచేసుకున్న



(మిగతా 2వ పేజీలో..)

మన దునియా

మన అక్షరం – మన ప్రపంచం

# జర్నలిస్ట్ బస్వరాజుపై కేసులు.. ఎత్తివేయాలి!

(మొదటి పేజీ తరువాయి)

ఉపాధి హామీ పథకంలో అవకతవకలపై కథనం ప్రచురించిన నేపథ్యంలో బస్వరాజుపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారనే అంశంపై విఠల్‌రావు స్పందించారు. కథనంలోని అంశాలపై విచారణ చేయాల్సిన అధికారులు.. జర్నలిస్టుపై కేసుల దిశగా వెళ్లడం సరైనదేనా? అనే సందేహాలు ఆయన లేవనెత్తారు.

కేసుల వెనుక అసలు కారణమేంటి?

జర్నలిస్ట్‌పై నమోదైన కేసులకు సంబంధించిన ఫిర్యాదు, ఎఫ్ఐఆర్‌లోని అంశాలు, దర్యాప్తు పురోగతి తదితర వివరాలను అధికారులు పారదర్శకంగా వెల్లడించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆరోపణలు నిజమా? కథనంలో పేర్కొన్న అంశాలపై వాస్తవ పరిస్థితి ఏమిటి? అనే విషయాలపై సమగ్ర విచారణ జరగాల్సి ఉంది.

ప్రభుత్వం స్పందించేనా?

జర్నలిస్టులపై నమోదయ్యే కేసుల విషయంలో ఫిర్యాదుల నిజానిజాలను పూర్తిగా పరిశీలించిన తర్వాతే చర్యలు తీసుకోవాలని విఠల్‌రావు కోరారు. బస్వరాజుపై నమోదైన కేసులను సమీక్షించి, వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని ప్రభుత్వాన్ని, పోలీస్ శాఖను డిమాండ్ చేశారు.

## ఇది ఎల్ నినో కాదు.. కాంగ్-నినో: రాష్ట్రంలో కరెంట్ కోతలపై కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

విద్యుత్ కోతలు కొనసాగుతున్నాయంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇది 'ఎల్ నినో' ప్రభావం కాదని, పాలకుల అసమర్థత వల్లే తలెత్తిన 'కాంగ్-నినో' (కాంగ్రెస్ నినో) అని ఆయన ఎద్దేవా చేశారు. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ ప్రసంగించారు."కాంగ్రెస్ అధికారంలోకి వస్తే విద్యుత్ కోతలు తప్పవని తాము ముందే హెచ్చరించామని, ఇప్పుడు అదే నిజమవుతోందని" కేటీఆర్ పేర్కొన్నారు. "కాంగ్రెస్ వచ్చింది.. కరెంట్ పోయింది" అంటూ ఆయన ప్రభుత్వానికి చురకలంటించారు. బీఆర్ఎస్ హయాంలో విద్యుత్ వ్యవస్థ అత్యంత పటిష్ఠంగా నడిచిందని, కానీ కాంగ్రెస్ పాలనలో పరిస్థితి దారుణంగా మారిందని విమర్శించారు. అనేక సబ్‌స్టేషన్ల పరిధిలో రోజుకు 6 గంటలకు మించి విద్యుత్ సరఫరా కావడం లేదని పత్రికల్లో వస్తున్న కథనాలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. విద్యుత్ కోతలకు ప్రభుత్వం ఎల్ నినోను సాకుగా చూపుతోందని, అయితే అసలు కారణం ప్రభుత్వ వైఫల్యమేనని కేటీఆర్ ఆరోపించారు. జెన్‌కో వద్ద తగినంత బొగ్గు నిల్వలు లేవని, సింగరేణి నుంచి ఏకంగా 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. బొగ్గు అందుబాటులో ఉన్నప్పటికీ థర్మల్ విద్యుత్ కేంద్రాలను, నీరు లేదన్న సాకుతో జల విద్యుత్ కేంద్రాలను మూసివేశారని దుయ్యబట్టారు. రైతులకు 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేస్తామన్న హామీని ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## రేవంత్ రెడ్డికి నెల రోజుల డెడ్ లైన్ విధించిన కవిత

(మొదటి పేజీ తరువాయి)

ఏసీ పేలుడు ఘోర ప్రమాదానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని, ఈ ఘటనలో ఐదుగురు పసికందులు మరణించడం అత్యంత ఆవేదన కలిగిస్తోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడి ఆదిలాబాద్‌లోని సురక్ష చిల్డ్రన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను, వారి తల్లిదండ్రులను నేడు ఆమె పరామర్శించి ఓదార్చారు.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కవిత... ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకున్నానన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఐదుగురు గిరిజన, మైనార్టీ పసిపిల్లలు ప్రాణాలు కోల్పోతే కనీసం వచ్చి పరామర్శించే సమయం కూడా కేటాయించకపోవడం దారుణమన్నారు. వైఫల్యాలను ఎండగడుతూ, సీఎంకు నెల రోజుల గడువు విధిస్తున్నట్లు ప్రకటించారు. ఈ వ్యవధిలోగా ప్రభుత్వ ఆసుపత్రుల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, గిరిజన గూడేలకు రహదారి సదుపాయాలు కల్పించాలని, కేంద్ర నిధుల వివరాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రులకు నిధులు కేటాయించకపోతే ఆదివాసీలతో కలిసి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 'ఘెరావ్' చేపడతామని హెచ్చరించారు. రిమ్స్‌లో 150 ఏసీలు ఉన్నా ఒక్క మెకానిక్ కూడా లేకపోవడం, హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో రూ.500 కోట్ల ఆరోగ్యశ్రీ బకాయిలు పెండింగ్‌లో ఉండటం వైద్యారోగ్య రంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని దుయ్యబట్టారు.

## తెలంగాణ ఉద్యోగులకు గుడ్‌న్యూస్.. రెండు డీఏలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

(మొదటి పేజీ తరువాయి)

కార్యదర్శి సమావేశమయ్యారు. ఉద్యోగుల డిమాండ్లపై చర్చించిన అనంతరం రెండు డీఏలకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది.ప్రభుత్వం ఆమోదించిన రెండు డీఏల్లో మొదటిదాన్ని అక్టోబర్ నెల జీతంతో కలిపి ఉద్యోగులకు చెల్లించనుంది. దీంతో చాలాకాలంగా డీఏ కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగులకు ఊరట లభించనుంది.రెండో డీఏను ఉగాది పండుగ సందర్భంగా విడుదల చేసేందుకు ప్రభుత్వం అంగీకరించింది. దీంతో రెండు విడతల్లో ఉద్యోగులకు డీఏ ప్రయోజనం అందనుంది. అయితే డీఏలపై నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం.. ఉద్యోగులు కోరుతున్న పీఆర్సీపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. ఉద్యోగ సంఘాలు పీఆర్సీ అమలు కోసం డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం డీఏలకే పరిమితం కావడం చర్చనీయాంశంగా మారింది. పీఆర్సీపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే దానిపై ఉద్యోగుల్లో ఆసక్తి నెలకొంది.

# గణేశ్ నిమజ్జనం: 25న సెలవు, వేలాదిమంది పోలీసులతో భారీ బందోబస్తు

(మొదటి పేజీ తరువాయి)

నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నెల 25వ తేదీన (శుక్రవారం) జీహెచ్ఎంసీ పరిధిలో సాధారణ సెలవు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు, నిమజ్జనోత్సవాలను ప్రశాంత వాతావరణంలో ముగించేందుకు పోలీసు యంత్రాంగం భారీ బందోబస్తును ఏర్పాటు చేసింది. మొత్తం 28,400 మంది సిబ్బందిని భద్రతా విధులకు కేటాయించారు.ఈ నెల 25న నిమజ్జనం ఉండటంతో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలకు సెలవు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు వెలువరించింది. ఈ సెలవుకు బదులుగా నవంబర్ 14వ తేదీన (రెండో శనివారం) పనిదినంగా పరిగణించనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నిమజ్జన ఏర్పాట్లపై సజ్జనార్

నిమజ్జన ఏర్పాట్లపై హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. నగర పరిధిలో 20,000 మంది, ఇతర జిల్లాల్లో 8,400 మంది సిబ్బందితో పటిష్ఠ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఏడాది నిఘా కోసం అత్యాధునిక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతను వినియోగిస్తున్నామని, 24 డ్రోన్లు, 10,000 సీసీటీవీ కెమెరాల ద్వారా నిమజ్జన ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తామని పేర్కొన్నారు. హుస్సేన్ సాగర్ పరిసరాల్లో 100 హై-రైజ్ కెమెరాలు ఏర్పాటు చేశామని, చైన్ స్నాచింగ్‌లు, దొంగతనాల కట్టడికి 25 క్రైమ్ బ్రాంచ్ బృందాలను రంగంలోకి దించినట్లు వివరించారు.మహిళల భద్రత కోసం 'షీ టీమ్స్' నిఘాను ముమ్మరం చేశామని, ఊరేగింపుల్లో డీజేలు వినియోగం, మండపాల వద్ద అసభ్యకర పాటలు, నృత్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల్లో పాత వీడియోలు లేదా తప్పుడు ప్రచారాలను వ్యాప్తి చేయవద్దని ప్రజలకు సూచించారు. ఖైరతాబాద్ గణనాథుని దర్శన గడువు నేటి (బుధవారం) అర్ధరాత్రితో ముగియనుంది. నిమజ్జనం రోజున నగరంలోకి ప్రైవేట్ బస్సులు, భారీ ట్రక్కుల ప్రవేశానికి అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేశారు.

# భారీ వర్షానికి దెబ్బతిన్న చార్మినార్.. ఊడిపడిన ప్లాస్టరింగ్

(మొదటి పేజీ తరువాయి)

సుమారు అరగంట పాటు కురిసిన కుండపోత వానకు లాడ్ బజార్ వైపు ఉన్న మినార్ ప్లాస్టరింగ్ పెచ్చులు ఊడి కిందపడ్డాయి. ఈ ఘటన జరిగిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో తృటిలో ప్రమాదం తప్పింది.సమాచారం అందుకున్న చార్మినార్ భద్రతా సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని, కిందపడిన ప్లాస్టరింగ్ శకలాలను తొలగించారు. మంగళవారం సాయంత్రం నగరంలో 37.3 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ భారీ వర్షం కారణంగానే మినార్ ప్లాస్టరింగ్ ఊడిపడి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు.ఈ ఘటనపై భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) అధికారులు స్పందించారు. ఎడమవైపు మినార్ కింద ఉన్న గోడ వెలుపలి భాగం కొంత బలహీనపడటంతో భారీ వర్షానికి ప్లాస్టరింగ్ రాలిపోయిందని వారు తెలిపారు. దెబ్బతిన్న భాగానికి మరమ్మతులు నిర్వహించేందుకు ఇప్పటికే టెండర్ ప్రక్రియ కొనసాగుతోందని, వీలైనంత త్వరగా పనులు ప్రారంభించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు.ఇదిలా ఉండగా, రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాల్లో అత్యధికంగా సంగారెడ్డిలో 82.8 మి.మీ వర్షపాతం నమోదైంది. మరోవైపు, ఈ నెల 26వ తేదీ శనివారం వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో చార్మినార్‌తో పాటు ఇతర చారిత్రక కట్టడాల వద్ద అప్రమత్తంగా ఉండాలని అధికారులు నిర్ణయించారు.

# తెలంగాణకు కర్ణాటక సీఎం గుడ్ న్యూస్... జూరాలకు నీటి విడుదలకు ఓకే

**జూరాల ప్రాజెక్టుకు నీటిని విడుదల చేసేందుకు కర్ణాటక అంగీకారం**

**విడతల వారీగా 3 టీఎంసీలు ఇచ్చేందుకు సీఎం డీకే శివకుమార్ సుముఖత**

**బెంగళూరులో కర్ణాటక సీఎంతో తెలంగాణ మంత్రుల బృందం భేటీ**

**జూరాల కింద రైతుల ఇబ్బందులను వివరించిన మంత్రులు జూపల్లి, శ్రీహరి**



తెలంగాణలోని జూరాల ప్రాజెక్టుకు నీటిని విడుదల చేసేందుకు కర్ణాటక ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. విడతల వారీగా 3 టీఎంసీల నీటిని ఇచ్చేందుకు అంగీకారం తెలిపింది. ఈ నిర్ణయంతో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రైతులకు భారీ ఊరట లభించినట్లయింది.ఈ మేరకు బుధవారం తెలంగాణ మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి నేతృత్వంలోని ప్రజాప్రతినిధుల బృందం బెంగళూరులో కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో సమావేశమైంది. జూరాల ప్రాజెక్టు కింద నీటి అవసరాలను, వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులను వారు ఆయనకు వివరించారు.తెలంగాణ మంత్రుల విజ్ఞప్తిని పరిశీలించిన డీకే శివకుమార్, అధికారులతో చర్చించిన అనంతరం జూరాలకు నీటిని విడుదల చేసేందుకు అంగీకరించారు. దీంతో జూరాల ఆయకట్టు కింద ఎండిపోతున్న పంటలకు జీవం పోసినట్లయింది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తికి కర్ణాటక సానుకూలంగా స్పందించడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# సీఈసీకి తెలిసే రిగ్గింగ్ జరిగితే...!: ఎన్నికల కమిషన్‌పై ప్రియాంక గాంధీ తీవ్ర వ్యాఖ్యలు

కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా కేంద్ర ఎన్నికల కమిషన్‌తో పాటు ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై సంచలన ఆరోపణలు చేశారు. ఎన్నికల్లో అవకతవకలు జరుగుతున్నాయని తెలిసి కూడా సీఈసీ వాటిని అనుమతించి ఉంటే, అటువంటి చర్య దేశద్రోహం కిందకే వస్తుందని ఆమె తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బుధవారం తన వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని నీలంబూరులో విలేకరులతో మాట్లాడిన సందర్భంగా ప్రియాంక ఈ వ్యాఖ్యలు చేశారు.ఎన్నికల కమిషన్ (ఈసీ) పనితీరులో అక్రమాలు చోటుచేసుకున్నాయని, కమిషనర్ల మధ్య విభేదాలు ఉన్నాయని వెలువడిన మీడియా కథనాలపై ఆమె స్పందించారు. ఈ పరిణామాలు ప్రజాస్వామ్యానికి "అత్యంత ప్రమాదకరం" అని ఆమె అభివర్ణించారు. ఈ వ్యవహారంపై నిష్పక్షపాత విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) సందర్భంగా పేర్ల తొలగింపు సహా పలు ఇతర అంశాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి అసమ్మతి వ్యక్తం చేశారన్న కథనాలను ఈ సందర్భంగా ఆమె ప్రస్తావించారు. మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాల్లో లక్షలాది మంది ఓటర్ల పేర్లను జాబితా నుంచి అక్రమంగా తొలగించారని గత కొంతకాలంగా వస్తున్న



ఆరోపణలను ఆమె గుర్తుచేశారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా జరగకపోతే లేదా ఈసీయే అక్రమాలకు సహకరిస్తే, అది ప్రజాస్వామ్యంపై జరిగిన గొడ్డలిపెట్టుగా పరిగణించాల్సి ఉంటుందని అన్నారు. అయితే, ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే తీసుకున్నామని ఎన్నికల కమిషన్ ఇదివరకే స్పష్టం చేయడం గమనార్హం.

# ఉత్పత్తి ఎంత ముఖ్యమో కార్మికుడి రక్షణ అంతే ముఖ్యం

**జి ఎం ఎన్ రాధాకృష్ణ**

**మన దునియా, సెప్టెంబర్ 23,మంచిర్యాల జిల్లా**



మందమర్రి ఏరియాలోని కేకే ఓపెన్ కాస్ట్ గని (కేకే ఓసీపీ)ని బుధవారం రోజు సాయంత్రం సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్) కె. వెంకటేశ్వరులు, ఏ. మనోహర్ (సిపి అండ్ పి) కార్పొరేట్, మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ ప్రతినిధి బృందంతో కలిసి సందర్శించారు. ఈ పర్యటనలో భాగంగా గనిలో జరుగుతున్న బొగ్గు ఉత్పత్తి ప్రక్రియ, నాణ్యతా ప్రమాణాలు, వేగవంతమైన రవాణా మార్గాలు మరియు కార్మికుల రక్షణ చర్యలను అధికారులను అడిగి ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో డైరెక్టర్ మాట్లాడుతూ... ప్రస్తుత త్రైమాసిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను నిర్దేశిత సమయంలోగా చేరుకోవడానికి ఉత్పత్తి వేగాన్ని మరింత పెంచాలని సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని గనుల్లో సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించి, నాణ్యమైన బొగ్గును వినియోగదారులకు అందించవచ్చని తెలిపారు. అనంతరం ఎక్స్‌ప్రెస్ వే ఓబి (ఓవరబర్డెన్) కాంట్రాక్టర్లతో డైరెక్టర్ ప్రత్యేకంగా మాట్లాడారు. ఓబి తొలగింపు పనులను మరింత వేగవంతం చేయాలని, ఏవైనా సాంకేతిక సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించుకుంటూ ముందుకెళ్లాలని ఆదేశించారు. ఉత్పత్తి ఎంత ముఖ్యమో, ప్రతీ కార్మికుడి రక్షణ కూడా అంతే ముఖ్యం. 'భద్రతతో కూడిన ఉత్పత్తే సమర్థవంతమైన ఉత్పత్తి'. ప్రతీ ఒక్కరూ సురక్షితమైన వాతావరణంలో పనిచేసేలా అధికారులు అన్ని రక్షణ చర్యలు చేపట్టాలి. సింగరేణి సంస్థ అభివృద్ధిలో ప్రతీ కార్మికుడి పాత్ర కీలకమైనది. అధికారులు, ఉద్యోగులు మరియు కాంట్రాక్ట్ సిబ్బంది అందరూ ఒకే లక్ష్యంతో, సమన్వయంతో పనిచేసినప్పుడే నిర్దేశించుకున్న లక్ష్యాలను సులువుగా చేరుకోగలం. బొగ్గు తవ్వకాలతో పాటు గని పరిసర ప్రాంతాల్లో పచ్చదనం పెంచడానికి, పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.?ఈ కార్యక్రమంలో కేకే ఓ సి పి ప్రాజెక్ట్ ఆఫీసర్, రాంబాబు, సేఫ్టీ అధికారి పైడయ్య, ఎస్ అండ్ పిసి (ఏ ఎస్ ఓ) వెంకటేశ్వర రెడ్డి, కేకే ఓ సి అధికారులు, ఎక్స్ ప్రెస్ వే కాంట్రాక్టర్స్ , సిబ్బంది పాల్గొన్నారు.

# దొంగతనాలకు పాల్పడుతున్న ఆరుగురు నిందితుల అరెస్ట్

**రూ.50,000 నగదు, రెండు ద్విచక్ర వాహనాలు, 10 కిలోల కాపర్ వైర్, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం,**

**మన దునియా, సెప్టెంబర్ 23,మంచిర్యాల జిల్లా**




రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ బెల్లంపల్లి డివిజన్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో తాళం వేసిన ఇళ్లు, దుకాణాలు, వ్యవసాయ భూముల్లోని ట్రాన్స్‌ఫార్మర్లను లక్ష్యంగా చేసుకుని వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.50,000 నగదు, రెండు ద్విచక్ర వాహనాలు, 10 కిలోల కాపర్ వైర్, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్న మని ఏసీపీ తెలిపారు. రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా, ఐ పి ఎస్ మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్ మరియు తాండూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దేవయ్య పర్యవేక్షణలో తాండూర్ పోలీసులు ప్రత్యేకంగా దర్యాప్తు చేపట్టి తాండూర్, భీమిని, బెల్లంపల్లి, నెన్నెల్, తాళ్లగురిజాల, తిర్యాని, రెబ్బెన పోలీస్ స్టేషన్ల పరిధిలో జరిగిన దొంగతనాలపై దర్యాప్తు చేపట్టి, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకొని అనంతరం వారిని అరెస్ట్ చేసి గౌరవ న్యాయస్థానం ముందు హాజరుపరినట్లు బెల్లంపల్లి ఏసిపి కిరణ్ కుమార్ తెలిపారు.

అరెస్ట్ అయిన నిందితుల వివరాలు

1. బండి నీలేష్, తండ్రి: లక్ష్మణ్, వయస్సు: 37 సంవత్సరాలు, కులం: ఎస్ టి కొలవార్, వృత్తి: బైక్ మెకానిక్, నివాసం: బోయపల్లి బోర్డు, ప్రస్తుతం నార్లపూర్, రెబ్బెన మండలం.

2. దూల రాజేశాం, తండ్రి: మల్లేష్, వయస్సు: 30 సంవత్సరాలు, కులం: ఎస్ టి కొలవార్, వృత్తి: కూలీ, నివాసం: కతేర్ల, తాండూర్.

3. మీసాల బిక్షపతి, తండ్రి: మల్లమ్మ, వయస్సు: 30 సంవత్సరాలు, కులం: ౹ు కొలవార్, వృత్తి: కూలీ, నివాసం: కతేర్ల, తాండూర్.

4. దూల నవీన్, తండ్రి: మల్లేష్, వయస్సు: 26 సంవత్సరాలు, కులం: ౹ు కొలవార్, వృత్తి: కూలీ, నివాసం: కతేర్ల, తాండూర్.

5. ఈగం రాజేష్, తండ్రి: మల్లేష్, వయస్సు: 39 సంవత్సరాలు, కులం: ౹ు కొలవార్, వృత్తి: కూలీ, నివాసం: బట్వ్యాన్పల్లి గ్రామం, బెల్లంపల్లి మండలం.

6. రెబ్బెన శ్రీకాంత్, తండ్రి: అరజయ్య, వయస్సు: 30 సంవత్సరాలు, కులం: ౹ు కొలవార్, వృత్తి: కూలీ, నివాసం: రోళ్లపాడు గ్రామం, రెబ్బెన మండలం.

స్వాధీనం చేసుకున్న వస్తువులు- రూ.50,000 నగదు- టి ఎస్ 19 జీ 3474 -- హీరో ఎచ్ ఎఫ్ డీలక్స్ ద్విచక్ర వాహన-ూ్రా 25ూ 0753 -- ఎవతీశీ ూజూశ్రీవఅఎశీతీ ద్విచక్ర వాహన- 05 సెల్‌ఫోన్ల- 10 కిలోల కాపర్ వైర్

పోలీసు సిబ్బందికి అభినందనలు

నిందితులను చాకచక్యంగా పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన తాండూర్ సీఐ, భీమిని ఎస్ఐ, తాండూర్ ఎస్ఐ మరియు వారికి సహకరించిన పోలీస్ సిబ్బందిని అధికారులు అభినందించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి నిందితులను పట్టుకోవడంలో విశేష కృషి చేసిన హెడ్ కానిస్టేబుళ్లు టి. రాజేశ్వర్ (2113), ఎం. రాము (2823), వి. తిరుపతిరెడ్డి (363), కానిస్టేబుళ్లు ఎం. విజయ్ కుమార్ (2064), బి. తిరుపతి (3315) లను బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్ ప్రత్యేకంగా అభినందించి, క్యాష్ రివార్డ్ అందజేశారు. నేరాల నియంత్రణలో భాగంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ నేరస్తులను గుర్తించి, చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో పోలీస్ అధికారులు, సిబ్బంది మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఏసీపీ సూచించారు.

## ఎడ్లపాడు మండలంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం

**మన దునియా (ఉమ్మడి గుంటూరు జిల్లా) సెప్టెంబర్ 23**

ఎడ్లపాడు మండలంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం ( ఎన్ డి డి ప్రోగ్రాం) సెప్టెంబర్ 25, 2026న నిర్వహించనున్నట్లు యడ్లపాడు పి హెచ్ సి వైద్యులు డా. పి. భరద్వాజ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, హాస్టళ్లలో 1 నుండి 19 ఏళ్ల వయస్సు గల 8,793 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేయనున్నారు. 1-2 ఏళ్ల పిల్లలకు సగం మాత్ర, 3-19 ఏళ్ల పిల్లలకు పూర్తి మాత్ర ఇస్తారని వివరించారు. అనారోగ్యం తదితర కారణాలతో మిగిలిపోయిన వారికి అక్టోబర్ 5న మాప్-అప్ రౌండ్ నిర్వహిస్తామన్నారు. ప్రతి ఏటా ఫిబ్రవరి, సెప్టెంబర్ నెలల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తారని, నులిపురుగుల వల్ల పిల్లలు, కౌమార బాలికల్లో వచ్చే రక్తహీనతను నివారించడంలో ఆల్బెండజోల్ ఎంతో ఉపయోగపడుతుందని డా. భరద్వాజ పేర్కొన్నారు. దీనిపై ఎంపీడీవో కార్యాలయంలో కన్వర్జెన్స్ మీటింగ్ జరిగింది. ఈ సమావేశంలో ఎం పి పి ఝాన్సీ సాగర్, ఎంపీడీవో హేమలతాదేవి, డిప్యూటీ ఎంపీడీవో జాకీర్ హుస్సేన్ తదితర అధికారులు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయులు, క్రీడాకారులపై అవమానాన్ని ఖండిస్తూ గుంటూరులో నిరసన ర్యాలీ.. 'జగన్ దిష్టిబొమ్మ' దహనం..!

**మన దునియా (ఉమ్మడి గుంటూరు జిల్లా) సెప్టెంబర్ 23**



టీడీపీ కార్యాలయం ఎదుట పారాస్పోర్ట్స్ రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ 'గోనుగుంట్ల కోటేశ్వరరావు' ఆధ్వర్యంలో నిరసన. నిరసనలో పెద్దసంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలిపిన పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు, విభిన్న ప్రతిభావంతులు, పారా క్రీడాకారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు. ఉపాధ్యాయులు, క్రీడాకారుల గౌరవాన్ని కాపాడాలని నిరసనకారుల డిమాండ్.

## హాస్టల్ తండాలో ఘనంగా గణేష్ నిమజ్జనం

**ఖానాపూర్ ఆర్సి మన దునియా; సెప్టెంబర్ 23:**



జన్నారం: మండలంలోని హాస్టల్ తండా గ్రామంలో వినాయక చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా గణనాథుని నిమజ్జన కార్యక్రమాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో, రంగరంగ వైభవంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మాలోత్ రమేష్ నాయక్, లంబాడా కుల పోరాట సమితి మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాదావత్ శ్రీనివాస్ నాయక్, గ్రామ యూత్ జగదంబా అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. బంజారా సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా దాసులు, తీజ్ ఆటపాటలు, సంప్రదాయ నృత్యాలతో గణనాథునికి ఘనంగా వీడ్కోలు పలికారు. గ్రామంలోని చిన్నారులు, యువతీ యువకులు, మహిళలు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. గణేష్ ఉత్సవాలు గ్రామ ప్రజల్లో ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించడంతో పాటు బంజారా సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు దోహదపడుతున్నాయని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సహకరించిన గ్రామ పెద్దలు, యువతీ యువకులు, మహిళలు, భక్తులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## కవ్వాల్ గౌడ సంఘం నూతన కార్యవర్గానికి ఘన సన్మానం

**ఖానాపూర్ ఆర్సి మన దునియా; సెప్టెంబర్ 23:**



మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కవ్వాల్ గ్రామ గౌడ సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు ఏకగ్రీవంగా జరగడంతో నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు మేరుగు బాలగౌడ్, ఉపాధ్యక్షులు రంగు వెంకటేష్లను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారికి హార్దిక శుభాకాంక్షలు తెలియజేసి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ.. గౌడ సంఘం ఐక్యత, అభివృద్ధి కోసం నూతన కార్యవర్గం సమిష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు. సంఘ సభ్యుల సమస్యలను పరిష్కరించడంతో పాటు వారి సంక్షేమం కోసం నూతన నాయకత్వం చొరవ చూపాలని సూచించారు. గ్రామ అభివృద్ధిలో అన్ని వర్గాలను కలుపుకొని ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. అధ్యక్షులు, ఉపాధ్యక్షులు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ సంఘ అభివృద్ధికి కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు. నూతన కార్యవర్గం ఎన్నిక కావడం పట్ల గౌడ సంఘ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గుమ్మల సత్తయ్య, జునుగురి దుర్గయ్య, అల్లాటి రాజన్న, జొన్నల సతీష్, షాకిర్ అలీ, శేఖర్తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గౌడ సంఘ సభ్యులు తదితరులు పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

## గణపవరంలో భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వాముల మహా అన్నదానం

**ప్రారంభించిన జనసేన యువ నాయకులు చరణ్ తేజ**

**మన దునియా సెప్టెంబర్ 23**



నాదెండ్ల మండలం గణపవరం గ్రామంలోని శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానంలో శబరిమలై చిత్ర పూజ 41 రోజుల దీక్షను పురస్కరించుకుని మహా అన్నదాన కార్యక్రమం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. నియోజకవర్గ జనసేన పార్టీ యువ నాయకులు శ్రీ చరణ్ తేజ గారు ఈ పవిత్రమైన అన్నదానాన్ని స్వయంగా వడ్డించి లాంఛనంగా ప్రారంభించారు. తొలిరోజు సుమారు 250 మంది దీక్షాపరులైన అయ్యప్ప స్వాములకు భక్తిశ్రద్ధలతో అన్నప్రసాద వితరణ గావించారు. కఠిన నియమ నిష్టలతో 41 రోజుల పాటు దీక్షను ఆచరించే స్వాములకు సేవలందించడం ఎంతో పుణ్యప్రదమని, ఈ కార్యక్రమంలో పాలుపంచుకోవడం సంతోషంగా ఉందని చరణ్ తేజ ఈ సందర్భంగా పేర్కొన్నారు. 'స్వామియే శరణం అయ్యప్ప' శరణుఘోషతో ఆలయ ప్రాంగణం మార్మోగగా.. దీక్షా కాలం ముగిసే వరకు ఈ అన్నదాన సేవలు నిరంతరాయంగా కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వీరితోపాటు కమిటీ సభ్యులు మండలనేని వెంకటేశ్వర స్వామి, మండలనేని శ్రీనివాసరావు, స్వామి తులం పూర్ణచంద్రస్వామి చక్రవరం శివన్నారాయణ స్వామి మాదేని చంద్రమౌళి స్వామి సిద్దు హనుమంతరావు స్వామి తదితరులు ఉన్నారు.

మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

## గణేష్ నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు






**మన దునియా,వరంగల్,సెప్టెంబర్ 23**

గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు. సెప్టెంబర్ 23 నుంచి 24 వరకు నిర్వహించనున్న నిమజ్జన కార్యక్రమాల నేపథ్యంలో లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, ఇతర విభాగాలకు చెందిన అన్ని స్థాయిల పోలీసు అధికారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ నిమజ్జన బందోబస్తు ఏర్పాట్లపై అధికారులకు సమగ్రంగా బ్రీఫింగ్ ఇచ్చారు. ఇతర సంబంధిత శాఖలు, విభాగాలతో సమన్వయంతో పనిచేస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. నిమజ్జన మార్గాలు, ట్రాఫిక్ నిర్వహణ, భద్రతా చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజల సహకారం, చురుకైన భాగస్వామ్యంతో గణేష్ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా, సజావుగా జరిగేలా సమన్వయంతో పనిచేయాలని అధికారులకు స్పష్టం చేశారు.

## అరెస్ట్‌కు కారణం చెప్పాల్సిందే: సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు!

**మన దునియా,న్యూఢిల్లీ:సెప్టెంబర్ 23**




అరెస్టు చేసే సమయంలో ఎందుకు అరెస్ట్ చేస్తున్నారో నిందితుడికి అర్థమయ్యే భాషలో రాతపూర్వకంగా తెలియజేయడం తప్పనిసరి అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 22(1) ప్రకారం, తన అరెస్టుకు గల కారణాలను తెలుసుకునే హక్కు ప్రతి వ్యక్తికీ ఉందని పేర్కొంది. ఈ నిబంధనలను పాటించకుండా చేసిన అరెస్టును చట్టవిరుద్ధమైనదిగా పరిగణించి, సంబంధిత వ్యక్తిని వెంటనే విడుదల చేయాల్సి ఉంటుందని తెలిపింది. అలాగే, నిబంధనలను ఉల్లంఘించే పోలీసు అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని సూచించింది.

## శాశ్వత వినాయక మండప నిర్మాణానికి భారీ విరాళం





**హోటల్ టేస్ట్ యజమాని ఠాకూర్ అమృత్ సాగర్ రూ.1.80 లక్షల వ్యయంతో మండపాన్ని నిర్మించి వార్డు ప్రజలకు, కాలనీ వాసులకు అంకితం**

**మన దునియా,మొగిలిగిద్ద:సెప్టెంబర్ 23**

మొగిలిగిద్ద గ్రామంలోని జై భీమ్ యూత్ అసోసియేషన్, కాలనీ వాసుల కోసం శాశ్వత వినాయక మండపాన్ని నిర్మించారు. కీర్తిశేషులు తారాబాయి వెంకటప్రసాద్ జ్ఞాపకార్థం మొగిలిగిద్ద గ్రామపంచాయతీ 5వ వార్డు సభ్యుడు, ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంప్, హోటల్ టేస్ట్ యజమాని ఠాకూర్ అమృత్ సాగర్ రూ. 1.80 లక్షల వ్యయంతో మండపాన్ని నిర్మించి వార్డు ప్రజలకు, కాలనీ వాసులకు అంకితం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన గణనాథుడి ప్రత్యేక పూజా కార్యక్రమంలో షాద్‌నగర్ మాజీ శాసనసభ్యులు చౌలపల్లి ప్రతాప్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. శాశ్వత వినాయక మండప నిర్మాణానికి సహకరించిన ఠాకూర్ అమృత్ సాగర్‌కు కాలనీ వాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు..

# ఎంజీఎంపై మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ధ్వజం

**ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే అరెస్టులా..?**
**వినయ్ భాస్కర్‌పై పోలీసుల తీరు అప్రజాస్వామికమని ఆరోపణ**

**మన దునియా,వరంగల్:సెప్టెంబర్ 23**



వరంగల్‌లో మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్‌పై రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆరోపించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే అక్రమంగా అరెస్టులు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఎంజీఎం ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను పరిశీలించి, వాటిపై నిలదీసిన వినయ్ భాస్కర్‌పై పోలీసులు వ్యవహరించిన తీరు అప్రజాస్వామికమని పేర్కొన్నారు.

ఎంజీఎంలో వైద్య సేవలు కుంటుపడ్డాయి

ఎంజీఎం ఆసుపత్రిలో వైద్య వ్యవస్థ కుప్పకూలుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని నరేందర్ విమర్శించారు. ఓపీ చీటీలు అందుబాటులో లేకపోవడంతో ఏ4 పేపర్లపై వైద్యులు ప్రిస్క్రిప్షన్లు రాస్తున్న పరిస్థితి నెలకొందన్నారు. ఎక్స్‌రే యంత్రాలు పనిచేయకపోవడం, ల్యాబ్‌లు మూతపడటం వల్ల రోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

ప్రైవేట్ ల్యాబ్‌లకు రోగుల తరలింపు?

కమీషన్ల కోసం రోగులను ప్రైవేట్ ల్యాబ్‌లకు పంపుతున్నారనే ఆరోపణలు వస్తున్నా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని నరేందర్ అన్నారు. కొందరు ప్రభుత్వ వైద్యులు విధులకు గైర్హాజరై ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేస్తున్నారనే ఆరోపణలపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. 600 మంది సిబ్బంది ఉండాల్సిన చోట సగం మందితోనే సేవలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని తెరవాలి

కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన 24 అంతస్తుల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఇంతవరకు ఎందుకు ప్రారంభించలేదని నరేందర్ ప్రశ్నించారు. ఆరోగ్యశ్రీలో అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలపైనా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ప్రభుత్వ వైద్యాన్ని బలోపేతం చేయకుండా ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రులకు ప్రయోజనం కలిగేలా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని తెలిపారు. ప్రజారోగ్యాన్ని గాలికొదిలేసి పోలీసుల అండతో పాలన సాగించడం సరికాదని నరేందర్ అన్నారు. వరంగల్‌లో నూతన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని తక్షణమే ప్రారంభించి, ఎంజీఎంలో వైద్య సేవలను పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు.

# భక్తి శ్రద్ధలతో మండపంలోనే మట్టి వినాయకుడి నిమజ్జనం





**మన దునియా, సెప్టెంబర్ 23,మంచిర్యాల జిల్లా**

మందమర్రి శ్రీశ్రీశ్రీ వరసిద్ధి వినాయక గణేష్ మండలి ఆధ్వర్యంలో, మందమర్రి మార్కెట్ వ్యాపారస్తులు ప్రతిష్ఠించిన మట్టి వినాయకుడి నిమజ్జన కార్యక్రమాన్ని బుధవారం మండపం వద్దనే భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి, పూజించడం ఎంతో అవసరమని అన్నారు. మట్టి వినాయకులను ప్రోత్సహించడం ద్వారా నీటి కాలుష్యాన్ని నివారించడంతో పాటు పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. అనంతరం మందమర్రి ఎస్సై కూడా నిమజ్జన కార్యక్రమంలో పాల్గొని మట్టి వినాయకుడి ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు. పర్యావరణహితమైన మట్టి వినాయకులను ప్రోత్సహిస్తూ, ప్రతి ఒక్కరూ ప్రకృతి పరిరక్షణలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గణేష్ మండలి కమిటీ సభ్యులు, మార్కెట్ వ్యాపారస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# మరణించిన హోంగార్డ్ కుటుంబానికి రూ.20 వేల వెల్ఫేర్ ఎక్స్‌గ్రేషియా చెక్కు అందజేత

**మన దునియా,భూపాలపల్లి జిల్లా:సెప్టెంబర్ 23**

భూపాలపల్లి జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డ్ గోలి శ్రీనివాస్ ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులకు పోలీస్ శాఖ తరఫున వెల్ఫేర్ ఎక్స్‌గ్రేషియా కింద మంజూరైన రూ. 20,000 చెక్కును జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. హోంగార్డ్ గోలి శ్రీనివాస్ అకాల మరణం పోలీస్ శాఖకు తీరని లోటని అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పోలీస్ సిబ్బంది సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ వెల్ఫేర్ పథకాలు సిబ్బంది కుటుంబాలకు ఆపద సమయంలో ఆర్థిక భరోసా కల్పించడంలో కీలకంగా నిలుస్తాయని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ ఆర్ఐ సంతోష్ కుమార్ పాటు హోంగార్డ్ గోలి శ్రీనివాస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం



# ముత్తారం పాఠశాలలో బాత్రూముల సమస్యలను వెంటనే పరిష్కరించాలి ఎంఈఓ కు వినతి పత్రం





**ఎస్ఎఫ్ఐ ములుగు జిల్లా కార్యదర్శి టి ఎల్ రవి**

**మన దునియా, వాజేడు, సెప్టెంబర్ 23**

ములుగు జిల్లా వాజేడు ముత్తారం కాలనీలో ఎంపీ ఎస్ పి ఎస్ ముత్తారం పాఠశాలలో బాత్రూంలో పూర్తిస్థాయిలో లేకపోవడం విద్యార్థులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు విద్యార్థుల భద్రతకు ముప్పుగా మారిన గొయ్యి అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలి ఎస్ఎఫ్ఐ ములుగు జిల్లా కార్యదర్శి టి ఎల్ రవి తెలిపారు. విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకోవడానికి పాఠశాల బయటకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొనడంతో ఆందోళనకరమని పేర్కొన్నారు పాఠశాలలో అవసరమైన మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడం వల్ల ముఖ్యంగా చిన్నారులు బాలికలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇది వారి భద్రతకు కూడా ముప్పుగా మారే అవకాశం ఉందని అన్నారు అంతేకాకుండా బాత్రూం పక్కనే గోయింగ్ ఉండడంతో విద్యార్థులు ప్రమాదవశాత్తు అందులో పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు ప్రాణంగాంలో ఇలాంటి పరిస్థితులు ఉండటం విద్యార్థుల భద్రత పట్ల నిర్లక్ష్యానికి దారి తీయకూడదని స్పష్టం చేశారు విద్యార్థులకు పరిశుభ్రమైన మరుగుదొడ్లు సురక్షితమైన పాఠశాల వాతావరణ కల్పించడం సంబంధించిన అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు మండల విద్యాశాఖ అధికారులు వెంటనే పాఠశాల సందర్శించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిష్కరించాలని బాత్రూంలో సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు గురి వద్ద ప్రమాదాలు జరగకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు విద్యార్థులు ఆరోగ్యం భద్రతను దృష్టిలో ఉంచుకొని అవసరమైన మరుగుదొడ్ల నిర్మాణం లేదా మరమ్మతులు చేపట్టి బాల బాలికలకు వినియోగానికి అనువైన సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు అధికారులు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ తరఫున డిమాండ్ చేశారు



# ఆదివాసి భూమి హక్కులను కాలరాస్తున్న రెవెన్యూ అధికారులు ఆఫీస్ ముందు రిలే నిరాహార దీక్ష చేపట్టిన ఆదివాసిరైతులు





**వాజేడు తహసిల్దార్ ను వెంటనే బదిలీ చేయాలి**

**మన దునియా, వాజేడు , సెప్టెంబర్ 23**

ఆదివాసి నవనిర్మాణ సేన ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయం ముందు ఆదివాసి రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్షను బుధవారానికి రెండో రోజుకు చేరుకున్నాయి రెండు రోజుల నిరాహార దీక్షను ఆదివాసి నవనిర్మాణ మండల అధ్యక్షుడు మోడీ నాగరాజు రైతులకు పూలదండలు వేసి దీక్షలు ప్రారంభించారు ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ మండలంలోని ఆదివాసి ల భూ సమస్యలను పట్టించుకోవడం లేద ని ఆయన ఆరోపించారు చదువులేని ఆదివాసీలు తమ పట్టా భూములను గిరిజనేతరులు కబ్జా చేసిన రెవెన్యూ అధికారులు పెడుతున్న పెడుతున్నట్లు ఆయన మండిపడ్డారు ఏడ్జెర్లపల్లి జి సర్వే నెంబర్ 32 25 లో ఆదివాసులకు అసైన్మెంట్ పట్టాలు ఉన్నప్పటికీ గిరిజన ఇతరులు కబ్జా చేస్తే ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోకపోగా ఆదివాసి రైతుల పైన కేసులు పెట్టడం అన్యాయమని అన్నారు వాజేడు మండల రెవెన్యూ అధికారులు వలస గిరిజన ఇతరులకు కొమ్ముకాస్తున్నారని విమర్శించారు లకు తాకట్టు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు ఆదివాసి నవనిర్మాణ సేన ఆదివాసుల పక్షాన పోరాటం చేస్తున్న అని అన్నారు ఎడ్జెర్లపల్లి ఆదివాసీల సమస్య తక్షణమే పరిష్కరించకపోతే ఆమరణ నిరాహార దీక్షకు చేపడతామని హెచ్చరించారు ఈజ్ కార్యక్రమంలో ఏఎన్ఎస్ సోషల్ మీడియా రాష్ట్ర అధికార ప్రతినిధి పాయం అజయ్ జిల్లా కన్వీనర్ కుంజ మహేష్ జిల్లా కార్యదర్శి కంతి విజయ్ వెంకటాపురం మండల అధ్యక్షులు వాసం నారాయణ వాజేడు మండల ఉపాధ్యక్షులు తల్లడి ప్రసాద్ మండలం కార్యదర్శి తల్లడి సంతోష్ అట్టం బాలకృష్ణ జగదీష్ రైతులు పాల్గొన్నారు

# ఐటీ టవర్‌ను సందర్శించిన కలెక్టర్ భవేష్ మిశ్రా

**నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి**

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఐటీ టవర్?ను కలెక్టర్ భవేష్ మిశ్రా బుధవారం సందర్శించారు. ఐటీ టవర్ కేంద్రంగా కొనసాగుతున్న వివిధ కంపెనీల వివరాలను, వాటి పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు.

13 కంపెనీల్లో..

ప్రస్తుతం 13 కంపెనీలలో 380 మంది వరకు పని చేస్తున్నారని టీజీఐఐసీ జోనల్ మేనేజర్ శివ ప్రసాద్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయా కంపెనీల నిర్వాహకులను, అందులో పనిచేస్తున్న ఐటీ ఉద్యోగులను కలిసి స్థానికంగా అన్ని సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా అని ఆరా తీశారు. సాధ్యమైనంత మేరకు ఎక్కువ కంపెనీలు స్థానికంగా నెలకొల్పేలా చూడాలని, తద్వారా ఈ ప్రాంత యువతకు స్థానికంగా మరింత ఎక్కువ సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు లభించేందుకు ఆస్కారం ఉంటుందని కలెక్టర్ సూచించారు. వినూత్న ఆలోచనలు, సరికొత్త ఆవిష్కరణలతో ముందుకు వచ్చే స్టార్టప్? కంపెనీలకు ఐటీ టవర్ చక్కటి వేదికగా నిలుస్తుందని, దీనిని ఔత్సాహికులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట టీజీఐఐసీ ఏఈ శివకృష్ణ ఉన్నారు.



## పల్నాడులో అనధికార లేఅవుట్లపై ఉక్కుపాదం - జాయింట్ కలెక్టర్ సంజనా శ్రీహర్ష సమీక్ష

**మన దునియా (ఉమ్మడి గుంటూరు జిల్లా) సెప్టెంబర్ 23**



పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ( పి యు డి ఏ ) పరిధిలోని అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణ, అనుమతులపై జాయింట్ కలెక్టర్ సంజనా శ్రీహర్ష సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లాలో అనుమతి లేకుండా వెలిసిన లేఅవుట్ల వివరాలు, ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తుల పురోగతి, నిబంధనల ఉల్లంఘనలపై అధికారులను ఆరా తీశారు. అనధికార లేఅవుట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజలు పి యు డి ఎ అనుమతి ఉన్న లేఅవుట్లలోనే ప్లాట్లు కొనుగోలు చేసేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు.అనుమతుల ప్రక్రియను వేగవంతం చేసి, పారదర్శకంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

## జర్నలిస్ట్ బసవరాజుపై అక్రమ కేసులు ఎత్తివేయాలి: నిజామాబాద్ జిల్లా వాసి

**డిమాండ్మాజీ జడ్పి చైర్మన్ బి. ఆర్. ఎస్ రాష్ట్ర కార్యదర్శి దాదాన్నగారి విఠల్ రావు.**

**నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి:**



జర్నలిస్ట్ బస్వరాజు పై నమోదు చేసిన అక్రమ కేసులను తక్షణమే ఎత్తివేయాలని నిజామాబాద్ మాజీ జడ్పి చైర్మన్ బి. ఆర్. ఎస్ రాష్ట్ర కార్యదర్శి దాదాన్నగారి విఠల్ రావు ప్రభుత్వాన్ని, పోలీస్ శాఖను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మీడియా అనేది ప్రభుత్వానికి, ప్రజలకు నడుమ నిరంతరం వారధిగా పనిచేస్తూ, నిజాలను వెలికితీసే వ్యవస్థ అని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న అవకతవకలపై వాస్తవ కథనాన్ని అందించినందుకు గానూ, స్టాఫ్ రిపోర్టర్ బస్వరాజు పై అక్రమంగా కేసులు పెట్టి రిమాండ్‌కు తరలించడం తీవ్రంగా ఖండించదగిన విషయమని అన్నారు.ప్రభుత్వం మరియు పోలీస్ యంత్రాంగం నిజానిజాలను పరిశీలించి, అసత్య ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలే తప్ప, వాస్తవాలను రాసే విలేకరులపై కేసులు పెట్టడం సరికాదని హితవు పలికారు. బస్వరాజు పై మోపిన అక్రమ కేసులను వెంటనే తొలగించాలని, భవిష్యత్తులో పాత్రికేయులపై ఇటువంటి చర్యలకు పాల్పడకుండా చూడాలని ఆయన డిమాండ్ చేశారు.

## హనుమకొండలో సెప్టెంబర్ 26న పబ్లిక్ గార్డెన్లో జరిగే ప్రెస్ మీట్ ను విజయవంతం చేయండి

**నిజామాబాద్ జిల్లా మన దునియా**



దేశంలో 13 కోట్ల సహారా బాధితులకు రెండు లక్షల కోట్ల పై గా పేమెంట్లు చెల్లించాలని గత ఐదు సంవత్సరాల క్రితం నుంచి శాంతియుతంగా పోరాటాల నిర్వహిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నారు తప్ప పరిష్కార మార్గం చూపడంలో విఫలమైనారు పార్లమెంట్ ఎలక్షన్ ప్రచారంలో ప్రతి ఖాతాదానికి రూపాయి తో సహా చెల్లిస్తామని హామీలు ఇస్తూ ఓట్లు వేయించుకున్న తర్వాత హామీలు నీటి మూటలు గా మిగిలిపోతున్నాయి ప్రజలు సమస్యలతో సతమతమవుతుంటే సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వాలు కాలయాపన చేయడం వల్ల ఇప్పటికి దేశంలో సహారా ఇండియా తాతగారు 10 వేలకు పైగా చనిపోయారు వందలాది మంది ఏజెంట్లు సూసైడ్ ఎంతో మంది మానసిక పొంగిపోతూ గ్రామాల్లో ఖాతాదారుల ఒత్తిడికి తట్టుకోలేక గ్రామాలు వదిలి ఇతర రాష్ట్రాలకు బతుకుతెరువు కోసం వెళ్తున్నారు ఇప్పటికి ప్రభుత్వానికి ఎన్నో దుపలుగా వినతి పత్రాలు శాంతియుత నిరసన కార్యక్రమాలు చేపట్టిన చెవిటి వారి ముందు శంకు దినట్లు ఉంది ప్రభుత్వ వ్యవహారం గత మూడు సంవత్సరాల క్రితం పోర్టల్ ఆన్లైన్ పేమెంట్ అని కేంద్ర హోం శాఖ మంత్రి అమితా షా ప్రారంభించి 40 నెలలు అవుతున్న ఇప్పటికీ కేవలం 9200 కోట్ల రూపాయలను మాత్రమే ఆన్లైన్ పేమెంట్ చేయడం జరిగింది ఇంకా ఇవ్వాల్సింది రెండు లక్షల కోట్ల పైగా బకాయిలు ఖాతాదారులకు రావాల్సిన డబ్బులు రానందున వారి పిల్లల పెళ్లిళ్లు చదువులు వైద్యం గృహ నిర్మాణాలు నిలిచిపోయాయి వారి యొక్క జీవితాలు అంధకారంగా తయారైనవి ఎన్నో ఆశలు పెట్టుకొని భవిష్యత్తులో పనికొస్తాయని పొదుపు చేసుకుంటే గద్దలాగా సహర సంస్థ నిండున కాతదారులను ముంచేసింది ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు సమన్వయంతో సహా ఇండియా ఆస్తుల్ని వేలం వేసి వచ్చిన డబ్బుల్ని యుద్ధ ప్రాతిపదికన చెల్లించి కుటుంబాల్లో వెలుగులు నింపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు లేని యెడల ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నా బాలయ్య అన్నారు.

## రైతులను తప్పుదోవ పట్టించొద్దు: మంత్రి జూపల్లి

**మన దునియా,హైదరాబాద్:సెప్టెంబర్ 23**




రైతులను తప్పుదోవ పట్టించొద్దు: మంత్రి జూపల్లి తెలంగాణ : జూరాల నీటి విషయంలో రైతులకు తప్పుడు సమాచారం ఇవ్వొద్దని ప్రతిపక్షాలను మంత్రి జూపల్లి కృష్ణారావు హెచ్చరించారు. మంగళవారం సీఎల్పీలో మంత్రి జూపల్లి, వాకిటి శ్రీహరి మీడియాతో మాట్లాడారు. రాజకీయ లబ్ధికే బీజేపీ, బీఆర్ఎస్? డ్రామాలు ఆడుతున్నాయని, జూరాలలో నీరు లేకపోయినా విడుదల చేయాలని ఆందోళన చేయడం విడ్డూరమని వారు మండిపడ్డారు. కర్నాటక నుంచి నీటిని విడుదల చేయించేందుకు సీఎం రేవంత్, మంత్రులు అక్కడి ప్రభుత్వంతో చర్చిస్తున్నారని స్పష్టం చేశారు.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

# కృష్ణాపురం లో ఘనంగా "పోషణ్ మహా "కార్యక్రమం నిర్వహించారు





పోషకాహారం తోనే ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం చేయవచ్చు



**మన దునియా, వాజేడు, సెప్టెంబర్ 23**

ములుగు జిల్లా వాజేడు మండలం కృష్ణాపురం గ్రామపంచాయతీ పరిధిలో ఈరోజు పోషణ్ మహా కార్యక్రమాన్ని నిర్వహించారు సి డి పి ఓ ఇంద్ర సూపర్వైజర్ అంజమ్మ అధ్యక్షతన కృష్ణాపురం గ్రామపంచాయతీ సర్పంచ్ మరియు అంగన్వాడీ టీచర్స్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు పోషణ్ మహా అంటే మహిళలు పిల్లలు పోషకాహార లోపాల పి నివారించడమే లక్ష్యంగా చేపట్టిన పోషణ్ మహా(పోషణ మాసం) వేడుకలు స్థానిక అంగన్వాడీ కేంద్రాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా అధికారులు అంగన్వాడీ టీచర్స్ ఆరోగ్య కార్యకర్తలు మూడు గ్రామ పంచాయతీల అంగన్వాడీ టీచర్స్ ఆశా వర్కర్స్ కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సి పిడిఓ ఇంద్ర సూపర్వైజర్ అంజమ్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోజువారి ఆహారంలో స్థానికంగా లభించే ఆకుకూరలు కూరగాయలు తృణధాన్యాలు పండ్లను తీసుకోవాలని సూచించారు ముఖ్యంగా గర్భిణీలు చిన్నపిల్లలు ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలని రక్తహీనత బారిన పడకుండా ఐరన్ వంటి సమృద్ధిగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో చంద్రుపట్ల అంగన్వాడి టీచర్ గంగారం టేకులగూడెం కృష్ణాపురం కడేకల్ అంగన్వాడీ టీచర్స్ ఆశా వర్కర్ స్ గ్రామపంచాయతీ సర్పంచ్ విజయ్ తదితరులు పాల్గొన్నారు

## గణపతి శోభాయాత్రకు ఆటంకాలు లేకుండా చూడాలి: ఎమ్మెల్యే ధన్‌పాల్



**నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి :**

ఇందూరులో నిర్వహించే వినాయకుడి శోభాయాత్రకు ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్?పాల్ సూర్యనారాయణ అధికారులకు సూచించారు. బుధవారం నగరంలో శోభాయాత్ర రూట్?మ్యాప్?ను పరిశీలించారు.

నిజామాబాద్ దుబ్బ చౌరస్తా నుంచి..

దుబ్బ చౌరస్తా నుంచి లలితా మహల్, గాంధీ గంజ్, నెహ్రూ పార్క్, గాంధీ చౌక్, పవన్ టాకీస్, గాజుల్ పేట్, పెద్ద బజార్, గోల్ హనుమాన్ మీదుగా వినాయకుల బావి వరకు శోభాయాత్ర రూట్ మ్యాప్ ను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ...ఇందూరులో నిర్వహించే గణపతి శోభాయాత్ర ఎంతో ప్రత్యేకమైనది అన్నారు. సుమారు వందేళ్లుగా అనంత చతుర్దశి ఈ నెల 25నరోజున ప్రత్యేక రథంలో వినాయకుడి శోభాయాత్ర కొనసాగుతుందన్నారు. నగరంలోని అన్ని ప్రాంతాలను పరిశీలించామని, విద్యుత్, కార్పొరేషన్, పబ్లిక్ హెల్త్, పోలీసు శాఖల సమన్వయంతో పూర్తి ఏర్పాట్లు చేశామన్నారు.

నిజామాబాద్ విద్యుత్? దీపాల ఏర్పాటు..

ప్రధానంగా విద్యుత్ దీపాల ఏర్పాటు, రోడ్లపై గుంతల పూడ్చివేత, అవసరమైన చోట బీటీ రోడ్ల నిర్మాణం, వినాయకుల బావి వద్ద సౌకర్యాలు పరిశీలించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. మండప నిర్వాహకులు శాంతియుతంగా భక్తి శ్రద్ధలతో శోభాయాత్ర నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మేయర్ ఉమారాణి, కార్పొరేషన్ కమిషనర్ దిలీప్ కుమార్, పబ్లిక్ హెల్త్ ఈఈ తిరుపతి, బీజేపీ కార్పొరేటర్లు నాగోళ్ల లక్ష్మీనారాయణ, పసునూరి రాము, జగదీష్ కులకర్ణి, బంటు ప్రీతి ప్రవీణ్, ప్రసూన శ్రీనివాస్, జ్యోతి మురళి, పంచరెడ్డి శ్యామ్, శ్రీనివాస్, మరావర్ కృష్ణ, వనిత పాల్గొన్నారు.

## పార్టీల కంటే ప్రజలే ముఖ్యం.. రైతుల కోసం బెంగళూరు బాటలో ఎమ్మెల్యే

- **జూరాల నీటి కోసం కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌తో భేటీ.. సాగునీటి సమస్య పరిష్కారమే లక్ష్యం**



**మన దునియా,గద్వాల: సెప్టెంబర్ 23**

గద్వాల: రాజకీయాలకు అతీతంగా ప్రజల సమస్యలే ముఖ్యమనే అంశాన్ని ముందుకు తీసుకెళ్లేలా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి జూరాల సాగునీటి సమస్యపై దృష్టి సారించారు. జూరాల ఆయకట్టు రైతులు సాగునీటి కోసం ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజాప్రతినిధులతో కలిసి బెంగళూరు వెళ్లి కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌ను కలిశారు. జూరాల నుంచి నీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడకుండా ఆల్మట్టి నుంచి దిగువకు నీటిని విడుదల చేయాలని కర్ణాటక సీఎంను కోరినట్లు ఎమ్మెల్యే వర్గాలు తెలిపాయి. రైతుల సమస్యను నేరుగా కర్ణాటక ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నీటి విడుదలకు సానుకూల నిర్ణయం తీసుకునేలా చర్చలు జరిపినట్లు పేర్కొన్నారు. "పార్టీలు కాదు.. ప్రజలే ముఖ్యం" అనే విధంగా రైతుల సాగునీటి అవసరాల కోసం రాష్ట్ర సరిహద్దులు దాటి చర్చలు జరపడం ఇప్పుడు గద్వాల రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రైతుల పంటలు కాపాడటమే ప్రధాన లక్ష్యంగా జూరాల నీటి సమస్యకు పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే కోరినట్లు ఆయన వర్గాలు తెలిపాయి. నీటి విడుదలకు సంబంధించి కర్ణాటక ప్రభుత్వం తీసుకునే నిర్ణయం, విడుదల చేసే నీటి పరిమాణం, సమయంపై అధికారిక వివరాలు వెలువడాల్సి ఉంది. రైతులకు సాగునీరు అందే వరకు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నట్లు సమాచారం.

## వర్షంలోనూ పారిశుద్ధ్య సేవలు

**మన దునియా,వరంగల్:సెప్టెంబర్ 23**



గణేష్ నిమజ్జనోత్సవం సందర్భంగా నగరంలోని చిన్నవడ్డేపల్లి, ఉరుసుగుట్ట చెరువు తదితర నిమజ్జన కేంద్రాల వద్ద వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పారిశుద్ధ్య సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. నిమజ్జనానికి తరలివస్తున్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నారు. నిమజ్జన కేంద్రాలు, రహదారులపై పేరుకుపోతున్న చెత్తాచెదారం, వ్యర్థాలను వెంటనే తొలగిస్తూ పరిశుభ్రతను కాపాడుతున్నారు. వర్షం కురుస్తున్నా విధులకు హాజరై నిరంతరంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్నారు. భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులకు ఇబ్బందులు తలెత్తకుండా జీడబ్ల్యూఎంసీ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు పారిశుద్ధ్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశారు.

# శోభాయాత్రలో మండపాల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలి

**శోభాయాత్ర సందర్భంగా గణేష్ మండపాల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రాజేష్ చంద్ర సూచించారు.**

**నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి:**

శోభాయాత్ర సందర్భంగా గణేష్ మండపాల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రాజేష్ చంద్ర సూచించారు. బుధవారం ఆయన కామారెడ్డి పట్టణంలో గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు.

గణేష్ ఇమ్మర్షన్ సేఫ్టీ పలు మండపాల సందర్శన..

కామారెడ్డి పట్టణంలోని కల్కి గణేష్ మండలి, ఏకదంత గణేష్ మండలి, శివసేన గణేష్ మండలి, పాన్ చౌరస్తాలోని బాల గణేష్ మండపాలను ఆయన సందర్శించి గణేష్ విగ్రహాలను దర్శించుకుని పూజా కార్యక్రమాల్లో ఎస్పీ పాల్గొన్నారు. మండపాల వద్ద భద్రతా ఏర్పాట్లు, నిమజ్జనానికి తరలించే విధానం, భక్తుల రద్దీ తదితర అంశాలను పరిశీలించి ఉత్సవ నిర్వాహకులతో మాట్లాడి ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. నిమజ్జన ఊరేగింపు సమయంలో భక్తులు, నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని, పోలీసుల సూచనలను పాటిస్తూ ప్రశాంతంగా కార్యక్రమాన్ని నిర్వహించుకోవాలని సూచించారు. సందర్శన సందర్భంగా మండపాల వద్ద ఉన్న చిన్నారులను ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని వారితో సెల్ఫీలు, ఫొటోలు దిగి, ఉత్సవాలను ఆనందంగా జరుపుకుంటూనే భద్రతా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

**దేవునిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో..**



అనంతరం దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని టెక్రియాల్ చెరువు నిమజ్జన ప్రాంతాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను రాజేష్? చంద్ర పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా పోలీసు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. నిమజ్జన ప్రాంతాల్లో బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల భద్రత, పార్కింగ్, గజ ఈతగాళ్ల అందుబాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని కామారెడ్డి డీఎస్పీ మధుసూదన్, టౌన్ సీఐ నరహరి, రూరల్ సీఐ శ్రీధర్, దేవునిపల్లి ఎస్?ఐ రంజిత్?లకు సూచనలు చేశారు

# మాజీ ఎమ్మెల్యేపై పోలీసుల దాడి సరైంది కాదు

**దాస్యం వినయ్ భాస్కర్ పై పోలీసుల దాడి సరైనది కాదు**
**- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు**

**మన దునియా,వరంగల్:సెప్టెంబర్ 23**

వరంగల్ ఏంజిఏం ఆసుపత్రిలో పెచ్చులు ఉడి బేడ్లు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని వారికి సరైన వసతులు కల్పించాలని ఆసుపత్రి సందర్శనకు వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ మీద పోలీసుల దాడికి పూర్తిగా ప్రభుత్వమే బాధ్యత వహించాలని మాజీమంత్రి దయాకర్ రావు నేడు వీడియో నోట్ లో పేర్కొన్నారు. ప్రతిపక్షాల గొంతు నొక్కడమే రేవంత్ పని "ప్రతిపక్షాల గొంతు నొక్కడమే రేవంత్ పని అయ్యింది. ఆస్పత్రిలో పెచ్చులు ఉడి గాయపడిన రోగులను పరామర్శించడానకి వెళ్తున్న వినయ్ భాస్కర్ ను అడ్డుకొని పోలీసులు పిడి గుద్దులు గుద్దడం దాడి చేయడం ముమ్మాటికి పిరికి పంద చర్య. దాడి చేసిన పోలీసుల మీద చర్యలు తీసుకోవాలి. కార్యకర్తలు దైర్యంగా ఉండాలి. పోలీసులు దౌర్జన్యం చాలా చేస్తున్నారు మొన్న అసెంబ్లీ వద్ద మహిళా ఎమ్మెల్యేలలా మీద, అలాగే కేటీఆర్, హరీష్ రావు, నా మీద కూడా చేస్తున్నారు. రేవంత్ రెడ్డి పరిపాలన దుర్మార్గమైన పరిపాలన. ప్రజల పక్షాన నిలబడే నాయకుల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తిరు చాలా బాధాకరం. వినయ్ భాస్కర్ తొందరగా కోలుకోవాలి." అని రేవంత్ సర్కారుపై మాజీమంత్రి దయాకర్ రావు మండిపడ్డారు



# చర్చలు విఫలం... 5 రోజులు బ్యాంకులు బంద్!

**దేశవ్యాప్త సమ్మెకు బ్యాంకు సంఘాల పిలుపు**

**సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు మూడు రోజుల సమ్మె**

**శని, ఆదివారాలతో కలిపి మొత్తం ఐదు రోజులు బ్యాంకులు బంద్**

**వారానికి 5 రోజుల పని ప్రధాన డిమాండ్ అన్న యూనియన్లు**

**లావాదేవీలు ముందుగానే పూర్తి చేసుకోవాలని ప్రజలకు సూచన**




**మన దునియా,న్యూఢిల్లీ: సెప్టెంబర్ 23**

దేశవ్యాప్తంగా బ్యాంకింగ్ సేవలకు మరోసారి అంతరాయం ఏర్పడనుంది. బ్యాంకు యూనియన్లు, ప్రభుత్వ ప్రతినిధుల మధ్య జరిగిన చర్చలు విఫలం కావడంతో, యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చింది. ఫలితంగా సెప్టెంబర్ చివరి వారంలో వరుసగా ఐదు రోజుల పాటు బ్యాంకులు మూతపడనున్నాయి. వారానికి ఐదు రోజుల పనిదినాలు, ఇతర పెండింగ్ సమస్యల పరిష్కారం కోరుతూ బ్యాంకు సంఘాలు కొంతకాలంగా నిరసనలు తెలుపుతున్నాయి. ఈ క్రమంలో ఆర్థిక శాఖ సూచన మేరకు మంగళవారం డిప్యూటీ లేబర్ కమిషనర్‌తో జరిపిన చర్చలు ఫలప్రదం కాలేదు. ఐదు రోజుల పని విధానం అంశం పరిశీలనలో ఉందని ప్రభుత్వం పేర్కొన్నప్పటికీ, స్పష్టమైన హామీ యూనియన్లు అసంతృప్తి వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు మూడు రోజులపాటు బంద్ ప్రకటించారు. ఆ తర్వాత శని, ఆదివారాలతో కలిపి వరుసగా ఐదు రోజులు బ్యాంకు మూసి ఉండనుంది.

# ఐపీఎల్ 2027 వేలానికి వేదిక ఖరారు.. ఈసారి ఇండియాలోనే!




**డిసెంబర్‌లో ఐపీఎల్ 2027 ఆటగాళ్ల వేలం**

**వేదికగా గోవాను ఖరారు చేసిన బీసీసీఐ**

**మూడేళ్ల తర్వాత తిరిగి భారత్‌లో వేలం నిర్వహణ**

**భారీ వర్షాల కారణంగా మహిళల క్రికెట్ మ్యాచ్ వేదిక మార్పు**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2027 సీజన్ వేలంపై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కీలక ప్రకటన చేసింది. ఈ ఏడాది డిసెంబర్‌లో గోవా వేదికగా ఆటగాళ్ల వేలం నిర్వహించనున్నట్లు బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా బుధవారం స్పష్టం చేశారు. అయితే, వేలానికి సంబంధించిన కచ్చితమైన తేదీలను ఇంకా వెల్లడించాల్సి ఉంది.గత మూడు పర్యాయాలుగా ఐపీఎల్ వేలం విదేశాల్లోనే జరిగింది. అబుదాబి, దుబాయ్, సౌదీ అరేబియా వంటి నగరాలు ఈ వేలానికి వేదికలుగా నిలిచాయి. అయితే, ఈసారి తిరిగి భారత్‌లోనే వేలం నిర్వహించాలని నిర్ణయించినట్లు సైకియా తెలిపారు. "గత మూడుసార్లు వేలాన్ని అబుదాబి, దుబాయ్, సౌదీ అరేబియాలో నిర్వహించాం. ఈసారి డిసెంబర్‌లో గోవాలో నిర్వహించాలని నిర్ణయించాం" అని ఆయన మీడియాకు వివరించారు. ఇదే సందర్భంలో బీసీసీఐ మరో కీలక నిర్ణయాన్ని వెల్లడించింది. ఇండియా 'ఏ', ఆస్ట్రేలియా 'ఏ' మహిళా జట్ల మధ్య జరగాల్సిన మల్టీడే మ్యాచ్ వేదికను మార్పు చేశారు. హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలో భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా, ఈ మ్యాచ్‌ను పంజాబ్‌లోని మొహాలీకి తరలించారు. ఈ మ్యాచ్ సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 2 వరకు జరగనుంది.

# రషీద్ ఖాన్ ఆధిపత్యానికి బ్రేక్.. టీ20లలో కొత్త నంబర్ వన్ బౌలర్ గా పాక్ స్పిన్నర్

**టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేరిన అబ్రార్ అహ్మద్**

**ఆరు నెలల రషీద్ ఖాన్ ఆధిపత్యానికి తెరపడింది**

**బ్యాటింగ్ జాబితాలో కెరీర్ బెస్ట్ 4వ ర్యాంక్‌కు ఎగబాకిన ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్**

**శ్రీలంక సిరీస్‌లో రాణించడంతో ఐదో స్థానానికి చేరిన జోస్ బట్లర్**

అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) బుధవారం విడుదల చేసిన తాజా టీ20 ర్యాంకింగ్స్‌లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. అఫ్ఘానిస్థాన్ స్పిన్ సంచలనం రషీద్ ఖాన్ ఆరు నెలల సుదీర్ఘ ఆధిపత్యానికి తెరదించుతూ పాకిస్థాన్ లెగ్ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్ తొలిసారి బౌలింగ్ చార్టులలో అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. మరోవైపు, ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ అద్భుత ఫామ్‌ను కొనసాగిస్తూ బ్యాటింగ్ జాబితాలో కెరీర్ బెస్ట్ నాలుగో ర్యాంక్‌కు దూసుకొచ్చాడు.శ్రీలంకతో జరిగిన స్వదేశీ సిరీస్‌లో ఇంగ్లండ్ 3-0తో క్లీన్‌స్వీప్ చేయడంలో హ్యారీ బ్రూక్ కీలక పాత్ర పోషించాడు. ఈ సిరీస్‌లో మొత్తం 170 పరుగులు చేసిన అతను.. సౌతాంప్టన్‌లో అజేయంగా 114 పరుగులు సాధించి 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డును గెలుచుకున్నాడు. ఈ ప్రదర్శనతో టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో ఐదు స్థానాలు ఎగబాకి నాలుగో స్థానానికి చేరాడు. భారత వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ ఈ జాబితాలో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. కాగా, టెస్టుల్లో నంబర్ వన్ బ్యాటర్‌గా ఉన్న బ్రూక్.. వన్డే ర్యాంకింగ్స్‌లోనూ 12వ స్థానానికి చేరి, మూడు ఫార్మాట్లలోనూ టాప్-10లోకి ప్రవేశించేందుకు చేరువయ్యాడు.బౌలింగ్ విభాగంలో అనూహ్య మార్పు జరిగింది. ఇటీవల భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో రషీద్ ఖాన్ సాధారణ ప్రదర్శన చేయడంతో అతని రేటింగ్ ఒక పాయింట్ తగ్గింది. దీంతో 736 రేటింగ్ పాయింట్లతో ఉన్న పాకిస్థాన్ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్.. రషీద్‌ను వెనక్కి నెట్టి కెరీర్‌లో తొలిసారి నంబర్ వన్ టీ20 బౌలర్‌గా అవతరించాడు. ఉమర్ గుల్, సయీద్ అజ్మల్, ఇమాద్ వసీం, షాహిద్ అఫ్రిది తర్వాత ఈ ఘనత సాధించిన ఐదో పాకిస్థాన్ బౌలర్‌గా అబ్రార్ నిలిచాడు.ఇతర ఆటగాళ్లలో, శ్రీలంకపై 172 పరుగులు చేసిన ఇంగ్లండ్ వికెట్ కీపర్ జోస్ బట్లర్ రెండు స్థానాలు మెరుగుపరుచుకుని ఐదో ర్యాంక్‌కు చేరాడు. భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఏడు స్థానాలు ఎగబాకి 22వ ర్యాంకును అందుకున్నాడు. బౌలింగ్ జాబితాలో ఇంగ్లండ్ పేసర్ జేమీ ఓవర్టన్ ఏకంగా 47 స్థానాలు ఎగబాకి ఆరో ర్యాంకుకు చేరుకోగా, భారత స్పిన్నర్లు అక్షర్ పటేల్ (15వ ర్యాంక్), రవి బిష్ణోయ్ (35వ ర్యాంక్) కూడా తమ ర్యాంకులను మెరుగుపరుచుకున్నారు.వన్డే ర్యాంకింగ్స్‌లో జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజా ఆస్ట్రేలియాపై రాణించి బ్యాటింగ్ జాబితాలో 24వ స్థానానికి, ఆసీస్ పేసర్ నాథన్ ఎల్లిస్ బౌలింగ్ జాబితాలో 17వ స్థానానికి చేరుకున్నారు.




# ఆస్ట్రేలియా బౌలింగ్‌ను ఎదుర్కోవాలంటే అదే కీలకం: గంభీర్

**ఆస్ట్రేలియాను ఎదుర్కోవాలంటే మానసిక దృఢత్వం కీలకమన్న గంభీర్**

**కమిన్స్, స్టార్క్, హేజిల్‌వుడ్, లియాన్‌తో యువ బ్యాటర్లకు పరీక్ష తప్పదని వ్యాఖ్య**

**శ్రీలంకలో ముందస్తు సన్నాహాల వల్ల మంచి ఫలితాలు వచ్చాయని వెల్లడి**

**న్యూజిలాండ్, ఆస్ట్రేలియా సిరీస్‌లకూ ముందే సిద్ధం కావాలని సూచన**

**స్పిన్‌ను సమర్థంగా ఎదుర్కోవడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్న కోచ్**



ఆస్ట్రేలియా జట్టులోని అనుభవజ్ఞులైన బౌలింగ్ దాడిని ఎదుర్కోవాలంటే భారత యువ బ్యాటర్లకు నైపుణ్యంతో పాటు మానసిక దృఢత్వం ఎంతో అవసరమని టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ అన్నాడు. ఒత్తిడిని ఎంతగా తట్టుకోగలిగితే అంత మంచి ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందని చెప్పాడు. 2027 జనవరి 21 నుంచి మార్చి 3 వరకు భారత్-ఆస్ట్రేలియా మధ్య ఐదు టెస్టుల బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ జరగనుంది.

**అనుభవజ్ఞులైన బౌలర్లతో పరీక్ష**

పాట్ కమిన్స్, మిచెల్ స్టార్క్, జోష్ హేజిల్‌వుడ్, నాథన్ లియాన్ లాంటి బౌలర్లతో కూడిన ఆస్ట్రేలియా బౌలింగ్ విభాగం భారత యువ బ్యాటర్లకు గట్టి పరీక్ష పెట్టనుందని గంభీర్ పేర్కొన్నాడు. నాగ్‌పుర్, చెన్నై, గువాహటి, రాంచీ, అహ్మదాబాద్ వేదికలుగా టెస్టులు జరగనున్నాయి.

"టెస్టుల్లో నైపుణ్యం ముఖ్యం. కానీ మానసికంగా ఎంత బలంగా ఉన్నాం? ఒత్తిడిని ఎంతగా భరించగలం? అన్నదే కీలకం. ఒత్తిడిని స్వీకరించి ముందుకు వెళ్లగలిగితే అవకాశాలు మెరుగవుతాయి" అని గంభీర్ అన్నాడు.

**శ్రీలంకలో ముందస్తు సన్నాహాల ఫలితం**

కఠిన సిరీస్‌లకు ముందస్తు ప్రణాళికతో సిద్ధమైతే ఫలితాలు స్పష్టంగా కనిపిస్తాయని గంభీర్ చెప్పాడు. శ్రీలంక పర్యటనను ఇందుకు ఉదాహరణగా చూపాడు. అక్కడ టెస్టులకు పది రోజుల ముందే చేరుకుని స్పిన్‌ను ఎదుర్కొనేందుకు ప్రత్యేకంగా సాధన చేశామని తెలిపాడు.శ్రీలంకతో ఆడిన రెండు టెస్టుల్లోనూ భారత్ ఇన్నింగ్స్‌కు 400కు పైగా పరుగులు సాధించిందని గుర్తుచేశాడు. అక్కడి పరిస్థితుల్లో అనుభవజ్ఞులైన స్పిన్నర్లను ఎదుర్కొని ఈ స్థాయిలో పరుగులు చేయడం ముందస్తు సన్నాహాల ఫలితమేనన్నాడు.

**టెస్టులకు సమయం ఇవ్వాలి**

దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌కు ముందు ఆస్ట్రేలియాతో టీ20లు ఆడిన తర్వాత కేవలం రెండు రోజుల వ్యవధిలోనే టెస్టు మ్యాచ్‌కు సిద్ధమయ్యామని గంభీర్ చెప్పాడు. వెస్టిండీస్‌తో సిరీస్‌కు ముందు కూడా ఆసియా కప్ ముగించుకుని రెండు ప్రాక్టీస్ సెషన్లతోనే టెస్టులోకి వెళ్లామని తెలిపాడు.అందుకే న్యూజిలాండ్, ఆస్ట్రేలియాతో సిరీస్‌లకు తగినంత ముందుగా సిద్ధం కావాల్సిన అవసరం ఉందన్నాడు. ముఖ్యంగా స్పిన్‌ను సమర్థంగా ఎదుర్కోవడంపై దృష్టి పెట్టాలని చెప్పాడు.

**టెస్టు క్రికెట్‌కు విలువ ఇవ్వాలి**

టీమ్‌లోకి వస్తున్న యువ ఆటగాళ్లు టీ20లతో వచ్చే డబ్బు, ప్రచారం కంటే టెస్టు క్రికెట్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని గంభీర్ అభిప్రాయపడ్డాడు. దేవదత్ పడిక్కల్, మానవ్ సుతార్ టెస్టు క్రికెట్‌పై ఆసక్తి, క్రమశిక్షణతో ఉన్నారని చెప్పాడు.మానవ్‌ను చాలా కాలంగా వివిధ పరిస్థితుల్లో ఆడిస్తూ తీర్చిదిద్దిన సెలెక్టర్లను, బీసీసీఐని గంభీర్ అభినందించారు. "ఎంత మెరుగ్గా సిద్ధమైతే.. అంత మెరుగైన ప్రదర్శన చేసే అవకాశం ఉంటుంది" అని అన్నాడు.

మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

## ‘ఆ రోజు మా జీవితాలనే మార్చేసింది’.. చిరంజీవిపై రామ్‌చరణ్ ఎమోషనల్ పోస్ట్



**సినీ రంగంలో చిరంజీవికి 48 ఏళ్ల పూర్తి**

**తండ్రికి రామ్‌చరణ్ భావోద్వేగ శుభాకాంక్షలు**

**చిరంజీవి ప్రయాణం తమకు స్ఫూర్తి అన్న చరణ్**

**50 ఏళ్ల మైలురాయి కోసం ఎదురుచూస్తున్నానని వెల్లడి**

**‘ప్రాణం ఖరీదు’తో 1978లో చిరంజీవి తెరంగేట్రం**

మెగాస్టార్ చిరంజీవి సినీ రంగంలోకి అడుగుపెట్టి 48 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఆయన కుమారుడు, హీరో రామ్‌చరణ్ భావోద్వేగ పోస్ట్ చేశాడు. తండ్రి సినీ ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నాడు. 50 ఏళ్ల మైలురాయిని కలిసి జరుపుకునే రోజు కోసం ఎదురుచూస్తున్నానని చెప్పాడు.“నాన్నా.. మీరు సినిమాల్లోకి వచ్చి 48 ఏళ్లు పూర్తయ్యాయి. మా కుటుంబం మొత్తాన్నీ మార్చేసిన ఆ రోజును మేం ఎప్పటికీ గుర్తు చేసుకుంటాం. మీరు చేసిన ప్రతిదానికీ కృతజ్ఞతలు. ఇన్నేళ్ళుగా మీపై ప్రేమ చూపిస్తున్న ప్రేక్షకులకు కూడా ధన్యవాదాలు. మీ ప్రయాణం ఎప్పటికీ మాకు స్ఫూర్తే. ఇప్పుడు 50 ఏళ్ల సినీ ప్రస్థానాన్ని జరుపుకొనే రోజు కోసం ఎదురుచూస్తున్నా” అని చరణ్ పేర్కొన్నాడు.చిరంజీవి 1978లో ‘ప్రాణం ఖరీదు’ సినిమాతో తెరపైకి వచ్చాడు. అప్పటి నుంచి ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించాడు. అగ్ర కథానాయకుడిగా ఎదిగాడు. మెగాస్టార్‌గా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. 48 ఏళ్ల ప్రస్థానం పూర్తైన సందర్భంగా చిరంజీవి కూడా అభిమానులకు కృతజ్ఞతలు తెలిపాడు. తనకు అవకాశాలు ఇచ్చిన నిర్మాతలు, కొత్త పాత్రలు చూపించిన దర్శకులు, తోటి నటులు, సాంకేతిక నిపుణులకు ధన్యవాదాలు చెప్పాడు. అయితే విజయాలు, అవార్డుల కంటే అభిమానులు తనపై చూపించిన ప్రేమే ఎంతో గొప్పదని చిరంజీవి అన్నాడు. అభిమానులు తనను కుటుంబ సభ్యుడిగా భావించడం తనకు ఎంతో విలువైన విషయమని చెప్పాడు. వారి ప్రేమ వల్లే ‘చిరంజీవి’ అనే పేరు తనకు శాశ్వత గుర్తింపుగా మారిందని పేర్కొన్నాడు.

## ‘ప్యారడైజ్’.. నిజమైన ప్రేక్షకులకు ఎలాంటి ఇబ్బంది లేదన్న నాని

**ప్యారడైజ్ పై దుష్ప్రచారం.. బెంగళూరు కోర్టు ఉత్తర్వులు**

**నిజమైన రివ్యూలపై కాదన్న హీరో... ఏఐ ఫేక్ పోస్టులపైనే ఇంజంక్షన్ ఆర్డర్స్ అన్న నాని**

**టీజర్ తర్వాత నెగటివ్ ప్రచారంతో కోర్టుకెక్కిన నిర్మాతలు**

**సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల**

తన తాజా చిత్రం ‘ది ప్యారడైజ్’ విడుదలపై వచ్చిన కోర్టు ఉత్తర్వుల విషయంలో నేచురల్ స్టార్ నాని పూర్తి స్పష్టత ఇచ్చారు. బెంగళూరు కోర్టు ఇచ్చిన ఇంజంక్షన్ ఆర్డర్ కేవలం ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సాయంతో సృష్టించిన ఫేక్ పోస్టులు, బాట్లకు మాత్రమే వర్తిస్తుందని, నిజమైన ప్రేక్షకుల అభిప్రాయాలకు కాదని తేల్చి చెప్పారు. సినిమా చూసి తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా పంచుకునే హక్కు ప్రేక్షకులకు ఎప్పుడూ ఉంటుందని ఆయన అన్నారు.శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కిన ‘ది ప్యారడైజ్’ సినిమా టీజర్ విడుదలైనప్పటి నుంచి సోషల్ మీడియాలో కొందరు కావాలనే ఏఐ టెక్నాలజీ ఉపయోగించి నకిలీ, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు పోస్ట్ చేస్తున్నారని నిర్మాతలు ఆరోపించారు. ఈ నేపథ్యంలో, నిర్మాత శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్‌ఎల్‌పీ బెంగళూరు సివిల్ అండ్ సెషన్స్ కోర్టును ఆశ్రయించగా, సెప్టెంబర్ 19న న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.ఈ విషయంపై ముంబైలో జరిగిన ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో నాని మాట్లాడుతూ... కొంతమంది డబ్బులు ఇచ్చి బాట్లతో, ఏఐ టెక్నాలజీతో దుష్ప్రచారం చేయిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తమ పోరాటం అలాంటి వారిపైనే తప్ప, నిజమైన సినీ ప్రియులపై కాదని ఆయన వివరించారు. సినిమా చూసిన తర్వాత ప్రేక్షకులు తమ విమర్శలను, అభిప్రాయాలను ఎలాంటి భయం లేకుండా చెప్పవచ్చని భరోసా ఇచ్చారు. ప్రపంచవ్యాప్తంగా రేపు (సెప్టెంబర్ 24) ‘ది ప్యారడైజ్’ విడుదల కానుంది. ఇప్పటికే సెప్టెంబర్ 23 రాత్రి పలు నగరాల్లో ప్రత్యేక ప్రీమియర్ షోలు ప్రారంభమయ్యాయి. ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి.





## గణపతి వేడుకల్లో శ్రద్ధా కపూర్ సందడి.. మోదక్‌లపై లొట్టలేసిన భామ!

ముంబై, సెప్టెంబర్ 23: బాలీవుడ్ నటి శ్రద్ధా కపూర్ గణపతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పండుగ సందర్భంగా సంప్రదాయ ఉకడీచే మోదక్‌లను ఆస్వాదిస్తూ.. గణేశుడి ఆశీస్సులు తీసుకుంటూ సందడి చేశారు. ఈ వేడుకలకు సంబంధించిన కొన్ని ఫొటోలను ఆమె సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు.శ్రద్ధా కపూర్ షేర్ చేసిన ఫొటోల్లో.. స్నానం చేసిన అనంతరం జుట్టుకు టవల్ చుట్టుకుని ఉండగా మోదక్‌లను ఆస్వాదిస్తున్న దృశ్యం ఆకట్టుకుంది. అనంతరం వినాయకుడిని దర్శించుకుని ఆశీర్వాదం తీసుకుంటున్న ఫొటోను కూడా ఆమె పంచుకున్నారు.మరో ఫొటోలో తన మేనత్తలు, ప్రముఖ నటీమణులు పద్మినీ కొల్హాపురే, తేజస్వినీ కొల్హాపురేలతో కలిసి శ్రద్ధా కపూర్ కనిపించారు. అలాగే మోదక్‌లతో నిండిన బాక్స్, పాప్సికల్‌ను ఆస్వాదిస్తున్న ఫొటోలను కూడా ఆమె అభిమానులతో పంచుకున్నారు.ఈ ఫొటోలకు శ్రద్ధా సరదాగా “మోదక్ కావాలా? ఇవ్వను” అనే అర్థం వచ్చేలా ‘మోదక్ చాహియే? నహీ మిలేగా’ అంటూ క్యాప్షన్ ఇచ్చారు. దీంతో ఆమె అభిమానులు కూడా ఫొటోలపై ఆసక్తికరంగా స్పందిస్తున్నారు.

మోదక్‌కు ప్రత్యేకత

ఉకడీచే మోదక్ మహారాష్ట్రలో ఎంతో ప్రసిద్ధి చెందిన సంప్రదాయ మిఠాయి. బియ్యప్పిండితో తయారు చేసే ఈ మోదక్‌లో కొబ్బరి, బెల్లంతో చేసిన తీపి పూర్ణాన్ని నింపుతారు. సాధారణంగా ఆవిరిపై ఉడికించి తయారు చేసి.. గణేశ్ చతుర్థి సందర్భంగా వినాయకుడికి నైవేద్యంగా సమర్పిస్తారు.గణేశ్ చతుర్థి పది రోజుల పాటు జరిగే ప్రముఖ పండుగ. ఈ సందర్భంగా ఇళ్లలో, పలు ప్రాంతాల్లో మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. దేశవ్యాప్తంగా ఈ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు.

‘ఈత’లో శ్రద్ధా.. విభిన్న పాత్రలో

ఇక సినిమాల విషయానికొస్తే.. శ్రద్ధా కపూర్ తదుపరి ‘ఈత’ చిత్రంలో నటించనున్నారు. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ బయోపిక్‌లో ఆమె ప్రముఖ తమాషా, లావణీ కళాకారిణి విఠాబాయి భౌ మాంగ్ నారాయణ్‌గావ్‌కర్ పాత్రను పోషిస్తున్నారు.ఈ చిత్రంలో శ్రద్ధాతో పాటు రణ్‌దీప్ హుడా, మహ్మద్ జీషాన్ అయ్యూబ్, అనంత్ జోషి, సిద్ధార్థ్ జాదవ్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. మహారాష్ట్రకు చెందిన ప్రముఖ జానపద కళాకారిణి విఠాబాయి నారాయణ్‌గావ్‌కర్ జీవిత కథ ఆధారంగా ఈ సినిమా తెరకెక్కుతోంది. ఆమెను తమాషా రంగానికి చెందిన లిలి‘ఎంప్రెస్ ఆఫ్ తమాషా’లిలిగా పేర్కొంటారు.సాధారణ నేపథ్యం నుంచి ఎదిగి.. పంధర్‌పూర్ నుంచి తన కళా ప్రయాణాన్ని ప్రారంభించిన విఠాబాయి, కుటుంబ కళాబృందానికి నాయకత్వం వహిస్తూ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన విధానం ఈ చిత్రంలో చూపించనున్నట్లు సమాచారం. వ్యక్తిగత, ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూనే ఆమె కొనసాగించిన పోరాటం, పట్టుదల కూడా కథలో ప్రధానంగా ఉంటుందని తెలుస్తోంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2023/85680, Cel1 No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com